క్లుప్తంగా

మరింత మెరుగైన సేవలు అందించాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ఏలూరు (టూటౌన్): ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు బీఎస్ఎన్ఎల్ కృషి చేయాలని టెలికాం అడ్వైజరీ కమిటీ చైర్మన్, ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు. బీఎస్ఎన్ఎల్ జిల్లా ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన అడ్వైజరీ కమిటీ సమావేశానికి జనరల్ మేనేజర్ ఎల్ శ్రీను అధ్యక్షత వహించి మాట్లాడారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో బీఎస్ఎన్ఎల్ స్థితిగతులు, 4జీ సేవలు, గిరిజన అటవీ ప్రాంతం, మారుమూల గ్రామాల్లో 93 టవర్లు వచ్చినట్టు జీఎం శ్రీను వివరించారు. వైఫై రోమింగ్ సౌకర్యం, పలు అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడారు. ఎంపీ మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని తెలిపారు. కార్యక్రమంలో టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయానికి హామీ

ఏలూరు (టూటౌన్): ఏలూరు అమీనా పేట ఏటిగట్టు ప్రాంతంలో జన్మభూమి పక్కన నిర్మాణంలో ఉన్న మాల భవన్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రూ.40 లక్షల ఆర్థిక సాయం అందిస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హామీ ఇచ్చినట్టు మాల సంఘాల ఫెడరేషన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు వివరాలను స్థానిక ఎన్ఆర్‌పేటలోని ఎస్సీఆర్‌పీఎస్ అండ్ ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం సాయంత్రం వారు తెలిపారు. భవన నిర్మాణానికి ఎంపీ నిధులు ఈ ఏడాది రూ.20 లక్షలు, వచ్చే ఏడాది మరో రూ.20 లక్షలు అందజేస్తామని ఎంపీ చెప్పారన్నారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మరికొంత నిధులు అందజేస్తానని గతంలోనే హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎంపీని కలిసిన నాయకుల్లో మెండెం సంతోష్ కుమార్, దాసరి ఆంజనేయులు, పల్లెం ప్రసాద్, దాసరి రమేష్, గుడిపూడి రవి, దాసరి శ్యామ్, మెండెం ఆనంద్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్త శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జ్వాల పరమేశ్వర కాలనీ, దక్షిణపు వీధి, అశోకచక్రం రోడ్, పోణంగి రోడ్, అరుంధతి పేట, పడమర వీధి, దొంగల మండపం రోడ్, పాలతూము సెంటర్, శనగపప్పు బజార్ పరిసర ప్రాంతాలు, సత్రంపాడు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతానికి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. రామచంద్రరావు పేట, పత్తేబాద రోడ్డులోని నాలుగు గుడుల సెంటర్, పానుగంటి వారి వీధి, అతిథి హోటల్ రోడ్, రంగూన్ మేడ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఘనంగా యువజన దినోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ స్వామి వివేకానంద తన జీవితాంతం భారతదేశ ఔన్నత్యాన్ని చాటడానికి, యువతను మేల్కొలిపి దేశాభివృద్ధిలో వారిని భాగస్వాములు చేయడానికి కృషి చేశారని వివరించారు. కళాశాల సీపీడీసీ సభ్యుడు ఎల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వామి వివేకానంద తన బోధనల ద్వారా భౌతిక, ఆధ్యాత్మిక వికాసాల్లో సమన్వయం సాధించాల్సిన అవసరం తెలుస్తుందన్నారు.



హరిదాసు వేషధారణలో



పొంగలి వండుతున్న బాలికలు



బొమ్మల కొలువు వద్ద చిన్నారులు



వ్యవసాయం చేసేందుకు మేము సిద్ధం

సంక్రాంతి సందడి

చదువుతో పాటు తెలుగు సంస్కృతి కూడా తమకు తెలుసంటూ ఏలూరు సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తెలుగు సంప్రదాయాలతో సంక్రాంతి ముందస్తు సంబరాలు చేసుకున్నారు. రంగవల్లులు, గొబ్బెమ్మలు చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, పొంగలి వండి అందరికీ పంచారు. సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ సాయికుమారి, కరస్పాండెంట్ వి.రఘుకుమార్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు



ఇంటి ముందు గొబ్బెమ్మలు పెడుతున్న విద్యార్థులు



రోలులో వడ్లు దంచుతున్న విద్యార్థులు

నూరుశాతం ఉత్తీర్ణతకు ‘సంకల్ప్’

- ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్
- 50 రోజుల కార్యాచరణ ప్రణాళిక
- అందుబాటులో 32 మంది అధ్యాపకులు



ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియట్ పరీక్షలు త్వరలో ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఇప్పటికే ఇంటర్మీడియట్ బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. జిల్లా స్థాయిలో గత ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాలు ఆశాజనకంగా లేని విషయం తెలిసిందే. ఐతే ఈ ఏడాది మరింత ఉత్తమ ఫలితాల సాధనకు ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రతినిధులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ కళాశాలలో ఆర్ట్స్, సైన్స్, కంప్యూటర్ సబ్జెక్టుల విద్యార్థులు అభ్యాసం చేస్తున్నారు. గతేడాది ప్రథమ సంవత్సరం విద్యార్థులు 174 మంది పరీక్షలు రాయగా వారిలో 58 శాతంతో 101 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 133 మంది పరీక్షలు రాయగా వారిలో 80 శాతంతో 107 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఉత్తీర్ణతా శాతాన్ని నూరుకు చేర్చడానికి కృషి చేస్తున్నారు.

ఉత్తీర్ణతే లక్ష్యం

ముఖ్యమైన ప్రశ్నలు, జవాబులపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు సంకల్ప్ అనే స్టడీ మెటీరియల్‌ను రూపొందించి అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకూ పంపింది. ఈ మెటీరియల్‌లో అన్ని సబ్జెక్టులకు సంబంధించిన, పరీక్షల్లో రావచ్చు అని భావించిన ప్రశ్నావళితో పాటు జవాబులు కూడా ముద్రించారు. దీనిని అనుసరిస్తే ప్రతి విద్యార్థీ తప్పనిసరిగా ఉత్తీర్ణుడయ్యే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు నిర్వహించిన ఆయా పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా విద్యార్థులను శ్రేణులుగా విభజించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ అందజేశారు. వీటిలో ఏమైనా సందేహాలుంటే అధ్యాపకులు నివృత్తి చేస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.

ప్రత్యేక తరగతులు

విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని బారీగా పెంచేందుకు 50 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నారు. ప్రతి రోజూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సాధారణ రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండే కళాశాల తరగతులను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెంచారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సిలబస్ పాఠాలు చెబుతున్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంటే రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సంకల్ప్ స్టడీ మెటీరియల్‌లోని ప్రశ్నలు, జవాబులపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నారు.

అందుబాటులో అధ్యాపకులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 405 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరంలో 130 మంది జనరల్, 107 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. ద్వితీయ సంవత్సరంలో 90 మంది రెగ్యులర్, 78 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ పాఠ్యాంశాల బోధనకు, ప్రత్యేక తరగతుల నిర్వహణకు 13 మంది రెగ్యులర్, 12 మంది కాంట్రాక్ట్, నలుగురు అతిథి, మరో ముగ్గురు ఎంటీఎస్, పీటీజే అధ్యాపకులు ఉన్నారు.

సంపూర్ణ ఉత్తీర్ణతే లక్ష్యం



ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధనకు కృతనిశ్చయంతో ఉన్నాం. అధ్యాపకులు సైతం విద్యార్థులను అన్ని రకాలుగా సిద్ధం చేస్తున్నారు. సంకల్ప్ స్టడీ మెటీరియల్ వారికి మరింత ఉపయుక్తంగా ఉంటుంది. తెలియని విషయాలను అడిగి తెలుసుకునే స్వేచ్ఛను విద్యార్థులకు ఇస్తున్నాం. ప్రత్యేక తరగతులకు విద్యార్థుల నుంచి మంచి స్పందన, ఫలితాలు రాబడుతున్నాం.

– ఎ.రాజ్ కృష్ణ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏలూరు

ప్రసన్న వెంకటేశ్వరునికి స్వర్ణాభరణాల సమర్పణ



ఆలయ కమిటీ ప్రతినిధులకు స్వర్ణాభరణాలు, వెండి వస్తువులు అందిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడు శ్రీ బాలయప్ప క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారికి అయ్యప్ప గురు స్వామి తడికమళ్ల ప్రసాద్, పురుషోత్తం గురుస్వామి, ప్రముఖ వైద్యులు ఎంఎల్‌వీ ప్రసాద్, స్థానిక భక్తులు కోమలి ప్రసాద్ స్వర్ణాభరణాలు, వెండి తొడుగు, కాసులపేరు, సాలగ్రామ మాల వగైరాలను సమర్పించారు. గురువారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.రెండున్నర లక్షలు ఖరీదు చేసే ఆభరణాలను ఆలయ ప్రతినిధులకు అందించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి బొల్లా సత్యనారాయణ, కోశాధికారి వెంకట్, అర్చకులు, నిర్వాహకులు డీఎస్ సుబ్బారావు, ఎ.పోతురాజు, గంటా నాగేంద్ర, పీవీ. శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందించిన ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్ : ఏలూరులోని మౌలానా అబుల్‌కలామ్ అజాద్ నగర పాలక ఉర్దూ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను యూటీఎఫ్ నగర శాఖ అధ్యక్షురాలు షేక్ పర్వీన్‌భేగం, మీడియా కన్వీనర్ ఇన్‌చార్జి ఎండీ జక్రియా ఆర్థిక సాయంతో అందజేశారు. ఈ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం ఖాజిధాభేగం విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సాకు నాక్ ఏ ప్లస్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సెయింట్ థెరిస్సా స్వయం ప్రతిపత్తి మహిళా కళాశాలకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించిందని ప్రిన్సిపాల్ సిస్టర్ పి.మెర్సీ తెలిపారు. నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) బృందం ఈనెల 3, 4 తేదీల్లో తమ మహిళా కళాశాలను సందర్శించిందని పేర్కొన్నారు. పాఠ్యాంశాలకు సంబంధించి, బోధన, అభ్యసనం, మూల్యాంకనం, పరిశోధన, ఆవిష్కరణలు, కళాశాలలోని వసతులు మౌలిక సదుపాయాలపై నివేదికను సమర్పించిందని తెలిపారు. దీనిని అనుసరించి నాక్ కమిటీ 3.34 సీజీపీఏతో ఏ ప్లస్ గ్రేడ్ ను నిర్ధారించిందని ఆమె వివరించారు.

న్యాయవాదుల అభ్యున్నతికి కృషి



డైరీని ఆవిష్కరించిన న్యాయవాదులు, నాయకులు

ఏలూరు (టూటౌన్): న్యాయవాదుల అభివృద్ధి, అభ్యున్నతి కోసం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) కృషి చేస్తుందని నాయకులు బండి వెంకటేశ్వరరావు, వాకాడ రాజారావు, పీఎస్ చందు అన్నారు. వారు ఐఏఎల్ ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక స్ఫూర్తి భవనంలో గురువారం ఐఏఎల్ 2025 డైరీని ఆవిష్కరించారు. ఐఏఎల్ న్యాయవాదుల సంక్షేమానికి నిరంతరం పనిచేస్తుందని, న్యాయవాదులకు రక్షణగా నిలిస్తుందని వారు వివరించారు. న్యాయవాదుల వెల్ఫేర్ బోర్డు ద్వారా మరిన్ని సౌకర్యాలు, రాయితీల కోసం వివిధ సంఘాలతో కలిసి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఐఏఎల్ బలోపేతానికి న్యాయవాదులంతా ఐఏఎల్‌లో సభ్యులుగా చేరాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు పీపీ శాస్త్రి, విశ్రాంతి జడ్జి ఎ.లక్ష్మి, న్యాయవాదులు రాజనాల రామ్మోహనరావు, చిక్కా భీమేశ్వరరావు, పీపీ రత్నం, బలగం బాలాజీ, ఏఐటీయూసీ నాయకులు ఎం కృష్ణ చైతన్య, ఆర్ శ్రీనివాస డాంగే, పుప్పాల కన్నబాబు, ఎ.అప్పలరాజు, బి.శ్రీనివాసరావు ఏఐఎస్ఎఫ్ నాయకులు శివకుమార్ పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి



వాహన యజమానులకు అవగాహన కలిగిస్తున్న ఆర్టీఓ కృష్ణారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కాంట్రాక్ట్ క్యారియర్ బస్సుల యజమానులు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఏలూరు ఆర్టీఓ కేఎస్ఎంవీ కృష్ణారావు సూచించారు. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ప్రైవేట్ క్యారియర్ వాహన యజమానులతో గురువారం నగరంలోని ఆయన కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని టిక్కెట్ల ధరలు అధికంగా వసూలు చేయరాదని హెచ్చరించారు. బస్సుల కిటికీలు, తలుపులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు తగిన సూచనలివ్వాలని ఆదేశించారు.

కోడి పందేలను అడ్డుకోవాలని వినతి



కలెక్టర్ వెట్రిసెల్వికి వినతి పత్రం అందిస్తున్న వెంకట లక్ష్మి, నాగలక్ష్మి

ఏలూరు (టూటౌన్): సంక్రాంతి ముసుగులో నిర్వహించే కోడి పందేలు, జూదాలను అడ్డుకోవాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఘంటసాల వెంకటలక్ష్మి సహకారంతో బలే నాగలక్ష్మి కలెక్టర్ కె.వెట్రిసెల్విని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేరుతో దెందులూరు నియోజకవర్గం దుగ్గిరాల గ్రామ సమీపంలో కోడిపందేలు, జూదాలు కోసం భారీ ఎత్తున చేస్తున్న ఏర్పాట్లను అడ్డుకోవాలని, వీటిని ఏలూరు జిల్లాలో కూడా అడ్డుకోవాలంటూ హై కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశామని పేర్కొన్నారు. వీటిని అడ్డుకోవాలంటూ హై కోర్టు ఈనెల 8న పోలీసు, రెవెన్యూ శాఖలకు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ ఆదేశాలను పాటించకుంటే ఈనెల 20వ తేదీ తరువాత కోర్టు ధిక్కరణ కింద హై కోర్టుని ఆశ్రయించవచ్చని పేర్కొందని తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అలంకరణ, నిత్య కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం తాళ్లపూడికి చెందిన తల్లాప్రగడ రామకృష్ణ శాస్త్రి శ్రీమద్రామాయణం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. నటరాజ నాట్య కళా డ్యాన్స్ అకాడమీకి చెందిన కళాకారిణిలు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించి అలరించారు. రాత్రి కపిలేశ్వర పురానికి చెందిన నేమాని నాగలక్ష్మి భాగవతారిణి శ్రీ అన్నమయ్య చరిత్ర అనే అంశంపై హరికథా కాలక్షేపం చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	52	బీన్లచిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	44	చామదుంపలు	44
బెండకాయలు	52	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	34	కంద	68
కాకర కాయలు	40-44	బీట్‌రూట్	46
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	52	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్	48	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	50	పాలకూర	10
బంగాళదుంపలు	30-36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07
దోసకాయలు	32-36	పుదీనా	05
ఆనపకాయ (1)	25-30	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

బాల్య వివాహాలను అరికడదాం



మల్కాపురంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

ఏలూరు రూరల్ : బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఆర్ వినోద్‌కుమార్ కోరారు. గురువారం ఏలూరు రూరల్ మండలం మల్కాపురంలో ఆ సంస్థ సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలపై 112, 1098 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వినోద్‌కుమార్ కోరారు. ప్రతి గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రెండు రోజుల వ్యాసరచన పోటీలు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు స్థానిక ఎస్‌పీడీబీటీ కళాశాలలో ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు నిర్వహించిన ఈ పోటీల్లో 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు అబ్జర్వర్‌గా కళాశాల తెలుగు లెక్చరర్ టి.ప్రేమ్ కుమార్ వ్యవహరించారు. శుక్రవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 11.30 గంటలకు వ్యాసరచన పోటీలు ప్రారంభమవుతాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం యశ్వంత్, ఎస్ సునీల్ కుమార్, వై శాంతి కిరణ్, బి.చందన్, ఎస్ లీలా కుమారి, పి.కీర్తన పాల్గొన్నారు.

ముందస్తుగా వాహనాల పన్ను చెల్లించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో వాహనాలకు పన్ను చెల్లించాల్సిన యజమానులు ఈ త్రైమాసిక పన్నును ముందుగానే చెల్లించాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ తెలిపారు. ఈ క్వార్టర్ నుంచి వాహన్ వెబ్సైట్ (నేషనల్ సాఫ్ట్వేర్) ద్వారా పన్నులు చెల్లించే కారణంగా ముందుగానే ఆయా వాహన సంబంధిత మండల మ్యాపింగ్, ఈకేవైసీలు వెబ్ సైట్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో మోటారు వాహన కేసులు బకాయి ఉన్నంటే త్వరితగతిన ఆ రాష్ట్రాల్లోనే అపరాధ రుసుం చెల్లించాలన్నారు. లేకుంటే ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించే అవకాశం ఉండదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరిమానా చెల్లించని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.